క్లుప్తంగా

దంత వైద్య శిబిరం రేపు

నరసన్నపేట: స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో శుక్రవారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఈ మేరకు సంఘం అధ్యక్షుడు ఎస్.ప్రభాకరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి చెందిన దంత వైద్యులు వచ్చి తనిఖీలు చేస్తారని, అవసరమై వారికి ఉచితంగా చికిత్స అందిస్తారన్నారు. అనంతరం విశ్రాంత ఉద్యోగుల సంఘ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. విశ్రాంత ఉద్యోగులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలి

నరసన్నపేట: కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్ పథకాలు వెంటనే అమలు చేయాలని సీపీఐ జిల్లా నాయకులు సనపల నర్సింహులు, కొన్న శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. నరసన్నపేటలో బుధవారం సీపీఐ మండల మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలోని సారవకోట, జలుమూరు మండలాల్లో గిరిజనులకు మౌలిక వసతులు కల్పించాలని కోరారు. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. అర్హులందరికీ పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేట్ పరం చేయవద్దన్నారు. ఆ పార్టీ నాయకులు నారాయణరావు, భాస్కర్, మధు, వసంతరావు, కిశోర్, అప్పన్న, తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ఎంపీడీఓగా రేణుక

నరసన్నపేట: స్థానిక మండల పరిషత్ అధికారిగా (ఇన్‌చార్జి) రేణుకను జెడ్పీ సీఈఓ శ్రీధర్ రాజా నియమించారు. ఇప్పటివరకు ఇక్కడ ఎంపీడీఓగా పనిచేసిన బి.మధుసూదనరావు ఉద్యోగ విరమణ చేశారు. ఈఓపీఆర్డీగా పనిచేస్తున్న రేణుకను ఇన్‌చార్జి ఎంపీడీఓగా నియమించారు. ప్రస్తుతం సాధారణ బదిలీల్లో నరసన్నపేటకు పూర్తిస్థాయి ఎంపీడీఓ వచ్చే అవకాశం ఉంది.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

ఆమదాలవలస: ఈ నెల 6వ తేదీన పట్టణంలోని 33/11 కేవీ పార్వతీశంపేట సబ్ స్టేషన్ పరిధి 11 కేవీ వెంకయ్యపేట ఫీడర్‌లో మరమ్మతులు, చెట్టు కొమ్మలు తొలగించనున్నారు. ఈ మేరకు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పైడి యోగేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంట వరకు మున్సిపాలిటీ పరిధిలోని తిమ్మాపురం, జగ్గుశాస్త్రులపేట, ఏపీ టిడ్కో, చంద్రహర్ష ఆక్వా, కేజీబీవీ స్కూల్, ఆర్‌ఆర్ గ్రానైట్, తదితర ప్రాంతాలు, రూరల్ పరిధిలో మందాది, మండా, బ్రిక్, అక్కులపేట, సంతకొత్తవలస, చిన్న జొన్నవలస, పెద్ద జొన్నవలస, కట్యాచార్యులపేట, దన్నానపేట, సైలాడ, కుమ్మరిపేట ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు. మండలంలోని తొగలరాం సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చెట్ల కొమ్మలు తొలగించే పనులు చేపడతామన్నారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంట వరకు కలివరం, దూసిపేట, తమ్మయ్యపేట, కొర్లకోట, చీమలవలస, నెల్లిపర్తి, వెదుళ్లవలస, బొబ్బిలిపేట, చింతలపేట గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు.

పనులు వేగవంతం చేయాలి



పనులను పరిశీలిస్తున్న వంశధార డీఈఈలు రామకృష్ణ, మురళి

ఎల్.ఎన్.పేట: ఖరీఫ్ సాగు సీజన్ ప్రారంభం అవుతున్నందున వంశధార కాలువల్లో చేపట్టిన నిర్మాణ పనులు వేగవంతం చేయాలని వంశధార డీఈఈలు రామకృష్ణ, మురళి అన్నారు. మండలంలోని దబ్బపాడు గ్రామానికి వెళ్లే దారిలో ఉన్న వంశధార పిల్ల కాలువలో జరుగుతున్న పనులు బుధవారం పరిశీలించారు. కాలువల్లోకి సాగునీరు విడిచిపెట్టే సమయానికి పనులు పూర్తి చేయాలన్నారు. పనుల్లో నాణ్యతాప్రమాణాలు పాటించాలన్నారు. వీరితో పాటు వంశధార ఏఈఈలు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన నిర్వాహకులకు శిక్షణ రేపు

హిరమండలం: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించి మధ్యాహ్న భోజన నిర్వాహకులకు శుక్రవారం ఒక్కరోజు శిక్షణ ఇస్తున్నట్లు ఎంఈఓ రాంబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో శిక్షణ ఉంటుందన్నారు. మండలంలోని 57 ప్రభుత్వ పాఠశాలలతోపాటు జూనియర్ కాలేజీలో మధ్యాహ్న భోజన నిర్వాహకులు హాజరుకావాలన్నారు. ఈ విషయంలో స్కూల్ హెచ్‌ఎంలు, కాలేజీ ప్రిన్సిపాళ్లు చొరవ తీసుకోవాలన్నారు.

విత్తనాల పంపిణీ

ఆమదాలవలస రూరల్: వ్యవసాయ రంగంలో కొత్త విధానాలను తీసుకురావాలని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. మండలంలోని దూసిపేట గ్రామంలో ఆమదాలవలస కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో వికసిత కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. రైతులకు వరి విత్తనాలు అందజేశారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

కూటమి వెన్నుపోటుపై ప్రజాగ్రహం

- కూటమి పాలన అంతా మోసం..
- సూపర్ సిక్స్ పేరుతో అన్ని వర్గాలకూ వెన్నుపోటు
- వెన్నుపోటు దినం ర్యాలీలో పాల్గొన్న పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి, వైఎస్సార్‌సీపీ శ్రేణులు
- ప్రజల పక్షాన పోరాటాలు చేస్తాం..

పాతపట్నం:

కూటమి ప్రభుత్వం ఏర్పడి ఎడాది పాలనలో అన్ని వార్గాల వారికి వెన్నుపోటు పొడిచిందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆరోపించారు. నియోజకవర్గ కేంద్రం పాతపట్నంలో రెడ్డి శాంతి ఆధ్వర్యంలో బుధవారం వెన్ను పోటు దినం ర్యాలీని నిర్వహించారు. పాతపట్నం పంచాయతీ కార్యాలయం వద్ద నుంచి మార్కెట్, ఆల్ ఆంధ్ర రోడ్డు మీదుగా ఆస్పత్రి కూడలి వరకు ప్లకార్డులు పట్టుకుని, ప్రజలకు సంక్షేమ పథకాలు ఇవ్వకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు వెన్ను పోటు పొడిచారని నినాదాలు చేస్తు ర్యాలీ చేపట్టారు. ఈ ప్రభుత్వం అన్ని రంగాల్లోనూ విఫలమైందని పోస్టర్లు ప్రదర్శించారు. ఆస్పత్రి కూడలి వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహానికి రెడ్డి శాంతి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం



పాతపట్నం: వెన్నుపోటు ర్యాలీలో పాల్గొన్న రెడ్డి శాంతి

తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని తహసీల్దార్ ఎస్.కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రెడ్డి శాంతి మాట్లాడుతూ ఎన్నో హామీలిచ్చిన చంద్రబాబు.. అధికారంలోకి వచ్చిన తరువాత ఒక్క హామీ కూడా నెరవేర్చలేదన్నారు. ప్రజల తరఫున పోరాటం చేస్తామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది కావస్తున్నా.. సూపర్ సిక్స్ హామీలు అమలు చేయలేదన్నారు. నిరుపేదలను ఆదుకునే ఆరోగ్యశ్రీ పథకాన్ని నిలిపివేశారన్నారు. అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, ఇన్‌పుట్ సబ్సిడీ, క్రాప్ ఇన్సూరెన్స్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, నిరుద్యోగ భృతి అమలు చేయకుండా అన్ని వర్గాలనూ మోసం చేశారన్నారు. పాతపట్నంలో జనావాసాల మధ్య మద్యం షాపు పెట్టించిన ఘనత పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావుకే దక్కిందన్నారు. నిత్యావసర సరుకుల కోసం గంటల తరబడి రేషన్ దుకాణాల వద్ద లైన్‌లో నిల్చోవాల్సి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సవిరిగాన ప్రదీప్, పెనుమజ్జి విష్ణుమూర్తి,



పాతపట్నం: ఆస్పత్రి కూడలిలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేస్తున్న రెడ్డి శాంతి

మీసాల రామకృష్ణ, గండివలస ఆనంద్, పోలాకి జయమునిరావు, రాష్ట్ర కార్యదర్శి పి.యోగేశ్వరరావు, జిల్లా అధికార ప్రతినిధి సాంబమూర్తి, రెడ్డి రామారావు, బైపోతు ఉదయ్ కుమార్, వైస్ ఎంపీపీ సవర ఆదినాయుడు, సవర రమేష్, ఆర్టీఐ వింగ్ విభాగం ఎనుగుత సూర్యం, లోలుగు లక్ష్మణరావు, ఎ.వి.సురేష్, చింతాడ సూర్యనారాయణ, బి.నారాయణమూర్తి, వైస్ ఎంపీపీ వంగపల్లి చిన్నారావు, గేదెల సూర్యం, వైస్ ప్రెసిడెంట్లు గోకవలస రామారావు, ఈగల చిన్నారావు, పడాల రంజీత్, పోత్రకండి మురళి, పనుకు మోహన్, అమర ఉష, జనరల్ కార్యదర్శులు టంకాల సుధ, చింతాడ త్రినాథరావు, ఆగతమూడి రంజీత్, అమర రమణ, దాంపురం రాజేశ్వరావు, శిమ్మ సాంబ, మామిడి గంగాధర్, పిన్నింటి ఫల్గుణరావు, పల్లి యోగి, సవర సుభాష్, బమ్మిడి ఖగేశ్వరావు, సీపాన ఆశోక్, సత్య బిశ్వాల్, గడే సుధీర్, శశిభూషణరావు, సామల్‌బాబు, వెలమల బాలరాజు, లుకలాపు ప్రసాదరావు, జీవా, తదితరులు పాల్గొన్నారు.



పాతపట్నం: వెన్నుపోటు దినం ర్యాలీలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి



పాతపట్నం: తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రెడ్డి శాంతి, పార్టీ నాయకులు



కొత్తూరు: వెన్నుపోటు దినం కార్యక్రమానికి మెట్టూరు నుంచి బయలుదేరిన కొత్తూరు పీఏసీఎస్ మాజీ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ, పార్టీ నాయకులు

ప్రజలందరినీ మోసం చేశారు



ఎన్నికల ముందు చంద్రబాబు, లోకేష్, పవన్ కల్యాణ్‌లు కలసికట్టుగా సూపర్ సిక్స్ హామీలు ఇస్తామని చెప్పారు. వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారు. అధికారం చేపట్టి ఏడాది అవుతున్నా హామీలు అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నారు. నమ్మి ఓట్లు వేసిన ప్రజలకు కూటమి పార్టీల నాయకులు వెన్నుపోటు పొడిచారు. అన్ని వర్గాల వారి నుంచి ఈ ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం అవుతుంది.

– శిమ్మ సాంబశివరావు, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి, గొట్టిపల్లి, ఎల్.ఎన్.పేట

రైతులకు అన్యాయం



అన్నదాత సుఖీభవ ఏడాదికి రూ.20 వేలు ఇస్తామని చంద్రబాబు చెప్పారు. ఎప్పుడు ఇస్తారో తెలియని పరిస్థితి. ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం నుంచి పైసా కూడా రైతు సాయం అందలేదు. బడ్జెట్‌లో కూడా వ్యవసాయానికి పెద్దగా నిధులు కేటాయించలేదు. గత ప్రభుత్వం రైతులకు ఎంతో మేలు చేసింది. ఏటా రూ.13,500 రైతు భరోసా నగదు వచ్చేది. వ్యవసాయ పనులకు బాగా ఉపయోగపడేది.

– బొంగు శ్రీరాములు, ఆర్.ఎల్.పురం, పాతపట్నం మండలం

వెన్నుపోటు చంద్రబాబు నైజం

- సూపర్ సిక్స్ పథకాలకు ఎగనామం
- అన్నివర్గాల ప్రజలకు వెన్నుపోటు పొడిచిన చంద్రబాబు
- ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేసిన వైనం
- ఇసుకాసురుడు ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్
- వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్



వెన్నుపోటు దినం ర్యాలీలో పాల్గొన్న చింతాడ రవికుమార్, నాయకులు, కార్యకర్తలు

ఆమదాలవలస: అనేక హామీలు ఇచ్చి వాటిని నెరవేర్చకుండా ప్రజలకు వెన్నుపోటు పొడవడం చంద్రబాబు నైజమని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ అన్నారు. బుధవారం వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని ఆమదాలవలస పట్టణంలో నిర్వహించారు. వన్ వే జంక్షన్ వద్ద నుంచి మెయిన్ రోడ్డు మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు నాయకులు, కార్యకర్తలతో కలిసి పెద్ద ఎత్తున ర్యాలీ చేపట్టారు. తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పప్పల గోవిందరావుకు వినతిపత్రం అందజేశారు. చంద్రబాబు ప్రజలకు పొడిచే వెన్నుపోటును గాంధీ జంక్షన్ వద్ద రవికుమార్ కత్తితో పొడిచి కళ్లకు కట్టినట్లు చూపించారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద రవికుమార్ మాట్లాడుతూ.. చంద్రబాబు ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించినందుకే వెన్నుపోటు దినం కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. 143 హామీలు ఇచ్చి ఒక్క హామీ కూడా నెరవేర్చకుండా ప్రజలకు వెన్నుపోటు పొడిచారన్నారు. ఈ ప్రభుత్వం చేస్తున్న తప్పులను ప్రశ్నిస్తే వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను జైల్లో పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే 15 వేల కోట్ల రూపాయలు విద్యుత్ చార్జీల రూపంలో ప్రజలపై భారం మోపిందన్నారు. అమరావతి పేరుతో నిధులను గోల్‌మాల్ చేస్తున్నారని ఆరోపించారు. పవన్ కల్యాణ్ మాటలు తప్ప.. ఆయన పాత్ర ప్రభుత్వంలో ఏమీ లేదన్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను ఇబ్బంది పెడితే నాలుగు సంవత్సరాల తర్వాత తిరిగి టీడీపీ నాయకులకు వడ్డీతో కలిపి తిరిగి ఇస్తామని హెచ్చరించారు. వైఎస్ జగన్మోహన్ రెడ్డి అధికారంలో ఉన్నప్పుడే ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందిందని ఆ విషయాన్ని ఎమ్మెల్యే కూన రవి కుమార్ గుర్తెరగాలన్నారు. భోగాపురం ఎయిర్ పోర్ట్, ఉద్దానం కిడ్నీ ఆస్పత్రి, మూలపేట పోర్టు వంటి అభివృద్ధి పనులు గత ప్రభుత్వ హయాంలోనే ప్రారంభమయ్యాయన్న సంగతి గుర్తు పెట్టుకోవాలన్నారు.

రోజుకు రూ.కోటి ఆదాయం లేనిదే కూనకు నిద్రపట్టదు..

ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్‌కు ప్రజల పట్ల చిత్తశుద్ధి లేదని, ఇసుకాసురుడు, భూకబ్జాదారుడు, అక్రమైనింగ్ రారాజు అనే బిరుదులు ఉన్నాయన్నారు. ఇసుక ర్యాంపుల్లో అక్రమ ఆర్జన రోజుకు కోటి రూపాయలు లేనిదే ఎమ్మెల్యేకు నిద్రపట్టదన్నారు. నిజంగా ఆయనకు చిత్తశుద్ధి ఉంటే నియోజకవర్గంలో వంశధార, నాగావళి నదుల అనుసంధానం హామీని ఏం చేశారని ప్రశ్నించారు. ఆమదాలవలసలో ఇండ్రస్ట్రియల్ పార్క్ నిర్మాణాన్ని గాలికి వదిలేశారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ బొడ్డేపల్లి రమేష్ కుమార్, ఆమదాలవలస, బూర్జ, సరుబుజ్జిలి, పొందూరు మండలాల జెడ్పీటీసీలు బెండి గోవిందరావు, బెజ్జిపురపు రామారావు, సురవరపు నాగేశ్వరరావు, లోలుగు కాంతారావు, మున్సిపాలిటీ, మూడు మండలాల పార్టీ అధ్యక్షులు పొడుగు శ్రీనివాసరావు, ఖండాపు గోవిందరావు, బెవర మల్లేశ్వరరావు, కొంచాడ రమణమూర్తి, పార్టీ ముఖ్య నాయకులు సువ్వారి నేతాజీ, బొడ్డేపల్లి పద్మజ, పార్టీ జిల్లా కార్యదర్శి పొన్నాడ చిన్నారావు, జిల్లా మేధావుల సంఘం అధ్యక్షుడు కొప్పల ఈశ్వరరావు, మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు గురుగుబెల్లి శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ మానుకొండ వెంకటరమణ, నాయకులు కర్నేని నాగేశ్వరరావు, మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు గుమ్మడి రాంబాబు, జల్లు బలరాం, బూరి శ్రీరామ్మూర్తి, వియ్యపు కృష్ణ, కరణం కృష్ణంనాయుడు, పార్టీ



తహసీల్దార్ కార్యాలయం వద్ద మాట్లాడుతున్న చింతాడ రవికుమార్



వినతిపత్రాన్ని అందజేస్తున్న చింతాడ రవికుమార్, నాయకులు

జిల్లా ఉపాధ్యక్షుడు కింజరావు సురేష్, వైస్ ఎంపీపీ లావేటి అనిల్, జిల్లా కార్యదర్శి లావేటి విశ్వేశ్వరరావు, మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు కొవిలాపు శేఖర్, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు మూడడ్ల రమణ, జిల్లా ప్రధాన కార్యదర్శి చింతాడ సత్యప్రసాద్, పొందూరు పట్టణ పార్టీ అధ్యక్షుడు గాడు నాగరాజు, వైస్ ఎంపీపీ వండాన వెంకటరావు, నాయకులు గుడ్ల మోహన్‌రావు, కిల్లాన ఈశ్వరరావు, దుంపల శ్యామలరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అభిమానులు, అన్ని వర్గాల ప్రజలు పాల్గొన్నారు.



వెన్నుపోటు దినం ర్యాలీలో పాల్గొన్న పార్టీ శ్రేణులు

సూపర్ సిక్స్ పేరుతో మోసం



ర్యాలీగా వస్తున్న ధర్మాన కృష్ణ చైతన్య, పార్టీ శ్రేణులు

- కూటమి ప్రభుత్వానిది ముమ్మాటికీ వెన్నుపోటే..
- పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య
- వెన్నుపోటు దినంకు తరలివచ్చిన పార్టీ శ్రేణులు

నరసన్నపేట: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ప్రజలకు కూటమి ప్రభుత్వం వెన్నుపోటు పొడించిందని, సీఎం చంద్రబాబు తన నైజాన్ని మరోసారి చూపారని, జూన్ 4వ తేదీ ముమ్మాటికీ వెన్నుపోటు దినమేనని వైఎస్సార్‌సీపీ నాయకుడు, పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య అన్నారు. ఇచ్చిన 143 హామీల్లో ఏ ఒక్క హామీ కూడా ఈ ఏడాది కాలంలో నెరవేర్చలేదని విమర్శించారు. నరసన్నపేటలో బుధవారం వెన్నుపోటు దినం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణచైతన్య మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో చేసిన మోసాలు, అరాచకాలు, అన్యాయాలు లెక్కకు మించి ఉన్నాయన్నారు. కూటమి కార్యకర్తల శ్రేయస్సు తప్ప.. ప్రజల బాగోగులు పట్టడం లేదన్నారు. యువతకు, రైతులకు, మహిళలకు, తల్లులకు ఇలా అన్ని వర్గాల వారిని ఈ ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం మోసం చేసిందన్నారు. వలంటీర్ వ్యవస్థ, ఇంటింటికీ రేషన్ పంపిణీ, ఫ్యామిలీ డాక్టర్ పథకాన్ని ఎత్తివేయడం శోచనీయమన్నారు. ఇప్పుడు సచివాలయాలను కుదించి ప్రజలకు సచివాలయ సేవలు మరింతగా దూరం చేస్తున్నారన్నారు. సదరం సర్టిఫికెట్ల పునః పరిశీలన పేరున దివ్యాంగులకు ఇచ్చే పింఛన్ కత్తిరించాలని కూటమి ప్రభుత్వం చూస్తుందని మండిపడ్డారు. స్థానికంగా ఆక్రమణలు పెరిగాయని, ఇసుక దందా హద్దు మీరిందని, మట్టి, గ్రావెల్ కొల్ల గొడుతున్నారని విమర్శించారు. అందిన మేరకు టీడీపీ నాయకులు దోచుకుంటున్నారన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న కృష్ణచైతన్య, నాయకులు

తరలివచ్చిన పార్టీ శ్రేణులు..

వెన్నుపోటు దినం కార్యక్రమానికి నియోజవర్గం నలుమూలల నుంచి ప్రధాన కార్యకర్తలు, నాయకులు, పార్టీ అభిమానులు తరలివచ్చారు. 9 గంటలకే అంబేడ్కర్ విగ్రహం వద్దకు చేరుకున్నారు. ప్లకార్డులు పట్టుకొని కూటమి ప్రభుత్వ తీరుపై నినాదాలు చేశారు. లక్ష్మీ టాకీస్ కూడలిలోని అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించి వినతిపత్రం సమర్పించారు. అక్కడి నుంచి ర్యాలీగా వైఎస్సార్ కూడలి వరకు వచ్చి వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ టి.సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జలుమూరు ఎంపీపీ వాన గోపి, పార్టీ నాయకులు కరిమి రాజేశ్వరరావు, చింతు రామారావు, వరుదు వంశీకృష్ణ, నక్క తులసీదాస్, కణుసు సీతారాం, ముద్దాడ బైరాగినాయుడు, కణితి కృష్ణారావు, లకలాపు రవి, కేసీహెచ్‌బీ గుప్త, రాజాపు అప్పన్న, జి.వి.రమణి, సదాశివుని కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



హాజరైన మహిళా కార్యకర్తలు, పార్టీ శ్రేణులు

ప్రణాళికలు తయారు చేసుకోవాలి

సరుబుజ్జిలి: రైతులు ప్రణాళికాబద్ధంగా సాగు చేస్తే ఆశించిన దిగుబడులు సాధ్యపడతాయని వ్యవసాయ విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త సంధ్యారాణి తెలిపారు. వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆమదాలవలస కృషి విజ్ఞాన కేంద్రం, వ్యవసాయశాఖ సంయుక్తంగా ఖరీఫ్ ముందస్తు ప్రణాళికా సదస్సును బుధవారం పెద్దపాలెం గ్రామంలో నిర్వహించారు. వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్త మాట్లాడుతూ సేంద్రియ, పచ్చిరొట్ట ఎరువుల ప్రాధాన్యం గురించి వివరించారు. సమతుల ఎరువుల వాడకం వలన నేల సారవంతాన్ని పరిరక్షించవచ్చని తెలిపారు. నత్రజని, పాస్ఫరస్, పొటాషియం వరిలో అధికంగా వినియోగిస్తే దిగుబడులు బాగుంటాయన్నారు. వ్యవసాయ పరిశోధనా మండలి శాస్త్రవేత్త శైలజ లింగాకర్షణ బుట్టల ప్రాధాన్యం గురించి వివరించారు. వ్యవసాయ అనుబంధరంగాలైన పెరటికోళ్లు,



అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త

పుట్టగొడుగులు, పశుగ్రాసాలు, చేపల పెంపకం, కూరగాయల సాగుపై దృష్టిసారిస్తే అధిక ఆదాయం ఆర్జించవచ్చని కె.వి.కె శాస్త్రవేత్త చింతాడ బాలకృష్ణ తెలిపారు.

56 మందికి కంటి పరీక్షలు

కొత్తూరు: మండలంలోని మెట్టూరు బిట్-3 ఆర్‌ఆర్ కాలనీలో సర్పంచ్ కొయిలాపు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం బుధవారం నిర్వహించారు. శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి వైద్యులు 56 మందికి కంటి పరీక్షలు చేపట్టారు. 26 మందికి కంటి ఆపరేషన్లకు గుర్తించి ప్రత్యేక వాహనలో కంటి ఆస్పత్రికి తరలించారు. అవసరమైన రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రత్యేక వాహనం ద్వారా రోగులను ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం